క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: నిరుపేద ఆడబిడ్డ పెళ్లయితే లక్ష 116 రూపాయలు ఇచ్చే గొప్ప పథకం కల్యాణలక్ష్మి అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో 28 మంది లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు. సీఎం కేసీఆర్ నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలతో అండగా నిలుస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

నిత్యావసరాల అందజేత

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజులో స్రవంతి అనే మహిళ ఇల్లు షార్టు సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. దీంతో చిన్నారులతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న ఆమెకు సేవ్ ఏ లైఫ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాణా ప్రతాప్ 10 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు బుధవారం అందజేశారు. పిల్లల స్కూలు పుస్తకాలు కూడా ప్రమాదంలో కాలిపోవడంతో దాతల సహకారంతో వారికి బుక్స్ అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భవాని, కాంతమ్మ, రమాదేవి, కోటమ్మ, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



అవంతినగర్ ఈస్ట్‌కాలనీలో మొక్కలు నాటిన లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. మూసాపేట డివిజన్ కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి. దేవేందర్‌రావు, ఉపాధ్యక్షుడు కిరణ్‌లక్ష్మి, కోశాధికారి బుచ్చయ్య, నాయకులు రమేష్, చవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన శ్రీనివాస్‌యాదవ్

మోతీనగర్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరడ ఖాయమని మేడ్చల్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బుధవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హెల్త్ సెంటర్ మూసివేతపై ఆగ్రహం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌ను మూసివేయడం పట్ల విద్యార్థులు, ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా ఓయూ కాలేజీలకు రెండు రోజులు సెలవులు ప్రకటించిన విషయం విదితమే. కానీ హెల్త్ సెంటర్‌ను ఉదయం కేవలం 2 గంటలు తెరిచి ఆ తర్వాత మూసివేయడంతో రోగులు ఇబ్బందులు పడుతూ వెనుతిరుగుతున్నారు. ఓయూ అధికారులు చొరవ తీసుకొని హెల్త్ సెంటర్‌ను తెరిపించాలని కోరారు.

రూ.లక్ష ఆర్థిక సాయం క్రైస్తవులకూ వర్తింపజేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని క్రైస్తవులకూ వర్తింపచేయాలని క్రిస్టియన్ మైనార్టీ నాయకులు డాక్టర్ కే.పాల్‌మార్క్ కోరా రు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి కొ ప్పుల ఈశ్వర్‌ను కలిసి తెలంగాణలో క్రైస్తవులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

అతిథి అధ్యాపకులను కొనసాగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న 1940 అతిథి అధ్యాపకులను కొనసాగించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న అతిథి అధ్యాపకుల 2023–24 విద్యా సంవత్సరానికి కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణను కోరారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్ మమత
- వార్డు కార్యాలయాలకు అందిన ఫిర్యాదులపై ఆరా



జోనల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: వార్డు పరిపాలనపై బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని 22 వార్డు కార్యాలయాల్లో అందిన ఫిర్యాదులపై ఆరా తీశారు. సర్కిళ్ల ఉప కమిషనర్లు, వార్డు పాలన అధికారులు, సహాయ మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదుల పరిష్కారం, ఆస్తిపన్ను వసూళ్లపై పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి వార్డులోని ఫిర్యాదులు ఎంత వరకు పరిష్కారమయ్యాయో... పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు ఎన్ని ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయానికి అందిన అన్ని ఫిర్యాదులను సిటిజన్ చార్టర్ ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించేలా వార్డు పరిపాలనాధికారి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆపరేటర్లు సమయ పాలన పాటించాలి..

వార్డు కంప్యూటర్ ఆపరేటర్లు విధిగా వార్డు కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు 3 నుంచి సాయంత్రం 5 వరకు వార్డు కార్యాలయాల్లో వారి శాఖకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు.

వార్డు కార్యాలయాలు సక్రమంగా పని చేసేలా చూడాలి..

వార్డుకు సంబంధించిన సమస్యలపై వార్డు పాలనాధికారులు సంబంధిత ఉపకమిషనర్ల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఉప కమిషనర్లు వాటిని పరిశీలించి పరిష్కరించాలన్నారు. వార్డు కార్యాలయాలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

ఆస్తిపన్ను వసూలుపై టార్గెట్ పెట్టాలి..

ఆస్తిపన్ను వసూళ్లపై బిల్ కలెక్టర్, టీఐ, ఏఎంసీల వారీగా రోజువారి టార్గెట్ విధించాలన్నారు. కమిషనర్ ఇచ్చిన నెలవారి టార్గెట్ ప్రకారం వసూలయ్యేలా ఉపకమిషనర్లు ప్రతి రోజు పర్యవేక్షించాలని ఆదేశించారు.

బకాయిలపై దృష్టి పెట్టాలి..

డిమాండ్ కం నోటీసు ఆస్తిపన్ను బిల్లులు అన్ని సక్రమంగా అందించి ప్రతి ఒక్క బిల్లుకు ముట్టినట్లు ఇంటి యజమాని దగ్గర సంతకం తీసుకోవాలన్నారు. పాత బకాయిలపై దృష్టి సారించి వసూళ్లు చేయాలన్నారు. టార్గెట్‌కు తగ్గకుండా వసూళ్ల చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు రమేష్, కిష్టయ్య, నాగవేణి, మల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉన్నాం

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అత్యవసర చర్యలు చేపట్టాలన్న ఆదేశాలతో జిల్లాలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మేరకు జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే.. అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నంబర్ 94924–09781కు ఫోన్ చేయాలని కలెక్టర్ అమయ్ కుమార్ ప్రజలను కోరారు.

ఇంట్లో నుంచి బయటకు రావొద్దు

ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంట్లో నుంచి బయటకు రావొద్దని కలెక్టర్ అమయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించడంతో పాటు అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు.

ఈ ఫోన్ నంబర్లను సంప్రదించండి

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫోన్ నంబర్ 040--27215959, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 99639-96908, 8074064746, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 040--29569700, ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 73311-64056, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో 96667-03077, దుండిగల్ మున్సిపాలిటీలో 95427-15377, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 91540-83772, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో 81435-89845, కొంపల్లి మున్సిపాలిటీలో 18004257590, మేడ్చల్ మున్సిపాలిటీలో 93920-11506, 86390-50325 , నాగారం మున్సిపాలిటీలో 96400-10053, పోచారం మున్సిపాలిటీలో 89857-73105, తూంకుంట మున్సిపాలిటీలో 91542-79694.

మెట్రో బాత్‌రూమ్‌లను వేరే చోట ఏర్పాటు చేయాలి



మెట్రోస్టేషన్ బాత్‌రూమ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

మూసాపేట: భరత్‌నగర్ న్యూ హెచ్‌ఐజీ వద్ద వరదనీటి లా నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మెట్రోస్టేషన్ బాత్‌రూమ్‌లను వెంటనే తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంఆర్ అధికారులను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం మెట్రో రైల్ అధికారులు, డీఈ రామకృష్ణ, ఏఈ రంజిత్‌తో కలిసి భరత్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఐజీ జనరల్ సెక్రటరీకృష్ణయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బాలానగర్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజుకాలనీలో ఆనందరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని చెల్లెలు ఆశాజ్యోతి (27) బుధవారం సుమారు 2గంటల సమయంలో బట్టలు తీసుకొని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో వారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అండగా ఆర్‌కేవై బృందం



నిత్యావసరాలు, గొడుగులు పంపిణీ చేస్తున్న ఆర్‌కేవై టీం సభ్యులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాస కాలనీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఆర్‌కేవై బృందం సభ్యులు అండగా నిలుస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు బుధవారం గొడుగులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ టీమ్ సభ్యులను అభినందించారు. నియోజకవర్గంలో ఎక్కడ ఆపద ఉన్నా ఈ బృందం సభ్యులు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్‌గౌడ్, వేణుగోపాల్ యాదవ్, బాలాజీ, కృష్ణ, బాలయ్య, ప్రసాద్, నాగరాజ్, హరిబాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు చేపట్టబోయే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కైలాష్‌నగర్ వద్ద చేపట్టనున్న కల్వర్ట్ , మంజీరా పైప్‌లైన్ తరలింపు పనుల గురించి జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, ఈఈ శ్రీకాంతి, డీఈ దుర్గ ప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, మేనేజర్ సుబ్రహ్మణ్యం, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, అక్బర్ ఖాన్, సందీప్‌రెడ్డి, నరేందర్ బిల్లా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కోరారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీనగర్‌లో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీసాయి సవిత, పి. సాహితిరెడ్డి, మౌనిక, దివ్య, అంజనా, శ్రీవాణి, నాయకులు మొహమ్మద్ ఖాజా, మహమ్మద్ సోఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కూకట్‌పల్లి: మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు 20మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ జన్మదినం పురస్కరించుకొని నిరుపేద విద్యార్థులకు 18వేల నోట్ పుస్తకాలను సైతం పంపిణీ చేస్తున్నామన్నారు.



ట్యాబ్‌లు అందజేస్తున్న జగన్‌మోహన్‌రావు

కాణిపాకంలో ఎమ్మెల్యే పూజలు



కూకట్‌పల్లి: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ పాలకమండలి చైర్మన్ మోహన్‌రెడ్డి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఏఎల్ వద్ద కాంగ్రెస్ నాయకుల సెల్ఫీ



హెచ్‌ఏఎల్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తదితరులు

బాలానగర్: సీఎల్‌పీ నేత బట్టి విక్రమార్క పిలుపు మేరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన సెల్ఫీల కార్యక్రమానికి పార్టీ అధిష్టానం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నాయకులు బాలానగర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో నెలకొల్పిన హెచ్‌ఏఎల్ కంపెనీ వద్ద బుధవారం సెల్ఫీలు దిగారు.ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, మధుమోహన్, సీటకోరు కృష్ణ, ఆకుల నరేందర్, అక్తర్ అహ్మద్, బాలకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు బంద్

శేరిలింగంపల్లి: వర్షం కారణంగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం కూడా బారికేడ్స్‌తో మూసివేయడంతో భెల్ చౌరస్తా నుంచి గచ్చిబౌలికి, గచ్చిబౌలి నుంచి భెల్ చౌరస్తాకు నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కూకట్‌పల్లి: ఇటీవల కురిసిన వర్షాలకి వసంతనగర్‌లోని రోడ్ నం.4, 5 వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. బుధవారం ఆ ప్రాంతాన్ని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ సాయిప్రసాద్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, వసంత్ నగర్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాము, వెంకటేశ్వరరావు, మురళీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆందోళనలో యూనియన్ రాష్ట్ర నేత శ్రీనివాస్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. 21 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన మానవహారం, ధర్నా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్మికులకు పీఆర్సీ, బీమా చెల్లించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన వెంటనే కార్మికులను పర్మినెంట్ చేస్తామని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ జీతాల బకాయి కూడా చెల్లించడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెలా జీతాలు రెగ్యులర్‌గా ఇవ్వాలన్నారు. సబ్బులు, నూనె, బట్టలు, చెప్పులు కూడా ఇవ్వడం లేదన్నారు. సమస్య పరిష్కరించకపోతే సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ జిల్లా నాయకులు సుధాకర్, కృష్ణ, రవి, ముత్యాలు, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు .

'బీఆర్‌బీ కోఆర్డినేటర్ తీరు సరికాదు'

ఉస్మానియా యూనివర్సిటీ: బాల రక్షణ భవన్ (బీఆర్‌బీ) కోఆర్డినేటర్ ప్రియాంక బాల్య వివాహం సంఘటనలో వ్యవహరించిన తీరు సరికాదని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. మేడ్చల్ జిల్లాలోని ఓ గ్రామంలోని దళితుల కుటుంబానికి చెందిన 15 ఏళ్ల అమ్మాయిని, 35 ఏళ్ల యువకుడితో జరుగుతున్న బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. అనంతరం మీడియాకు చిరునామాతో పాటు అన్ని వివరాలను వెల్లండిచారు. అయితే సెక్షన్ 74 జోనల్ జస్టిస్ యాక్ట్ (జేజే) నిబంధనలను ప్రకారం అత్యాచారాలు, బాల్యవివాహాలు జరిగినప్పుడు మహిళల చిరునామాను గోప్యంగా ఉంచాలి. కానీ బీఆర్‌బీ కోఆర్డినేటర్ ప్రియాంక నిబంధనలు ఉల్లంఘించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో బాధితుల చిరునామాను వెల్లడించడంతో పాటు సోషల్ మీడియా, యూ ట్యూబ్ చానళ్లలో అప్ లోడ్ చేయించగా నేటికి విషయం చక్కర్లు కొడుతుందన్నారు. దీంతో భవిష్యత్‌లో సదరు బాలికను పెళ్లి చేసుకునేందుకు ఎవరు ముందుకురారని పేర్కొన్నారు. మీడియాలో వచ్చిన కథనాలను సుమోటోగా తీసుకొని ప్రియాంక పై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

ఖాళీల భర్తీకి కసరత్తు

- టీచర్లు, ఆయాల ఖాళీల వివరాల సేకరణలో అధికారులు నిమగ్నం
- గ్రేటర్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 331 ఖాళీలు
- విద్యార్హతను పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్‌కు పెంచిన కేంద్రం

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. నగరంతో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 3,307 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 3.43 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో 914 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 1,19,800 మంది లబ్ధిదారులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 794 కేంద్రాల్లో 95,017 మంది లబ్ధిదారులు, రంగారెడ్డి జిల్లాలో 1600 కేంద్రాల్లో 1,70,797 మంది లబ్ధిదారులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య, పెరిగిన లబ్ధిదారులకు అనుగుణంగా ప్రస్తుతం పనిచేస్తున్న వారే కాకుండా.. అదనంగా టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్త వారిని నియమించేందుకు ఆయా జిల్లాల మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగాల భర్తీకి ఇదివరకు పదో తరగతి విద్యార్హత ఉండేది. కొత్త నియామకాలకు అభ్యర్థులు తప్పని సరిగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని కేంద్రం నిర్ణయించింది.



ఖాళీల పరిస్థితి ఇలా..

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 42, హెల్పర్లు 125 ఖాళీగా ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్ పోస్టులు, రంగారెడ్డి జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 8, హెల్పర్ పోస్టులు 32 ఖాళీగా ఉన్నాయి.

విధుల నిర్వహణలో వీరే కీలకం

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధులు నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాత్ర కీలకంగా ఉంటుంది. ఒకటి నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకువస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, అవి తిన్న తరువాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసి పిల్లలు కావడంతో వారి వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

వివరాలు సేకరిస్తున్నాం

హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల వివరాలు సేకరిస్తున్నాం. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. అనుమతి రాగానే భర్తీ ప్రక్రియకు నోటిఫికేషన్ వెలువడుతోంది.

– అక్కేశ్వర్‌రావు, మహిళా, శిశు, సంక్షేమాధికారి, మేడ్చల్(ఇన్‌చార్జి)

పోస్టుల వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్	914	1,19,800	167
మేడ్చల్	794	95,017	124
రంగారెడ్డి	1600	1,78,797	40
మొత్తం	3,307	3,43,694	331